VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 03-07-2024 సంపుటి : 06 సంచిక : 286 పేజీలు : 8 వెల : రూ 3-00

## కాంగ్రేసేతర ప్రధానిని జీర్ణించుకోలేని రాహుల్

**రాహుల్ ప్రసంగం తీరు దారుణం**
**ఆయనలా ఎవరూ ప్రవర్తించరాదు**
**ఎన్డిఎ ఎంపిలకు ప్రధాని మోడీ ఉద్బోధ**



న్యూఢిల్లీ,జూలై2: కాంగ్రెస్సేతర నేత వరుసగా మూడోసారి ప్రధాని కావడాన్ని హస్తం పార్టీ జీర్ణించుకోలేకపోతోందని నరేంద్రమోదీ విమర్శించారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉండి రాహుల్ గాంధీ సభలో అవమానకర ప్రసంగం చేశారని దుయ్యబట్టారు. ఆయనలా ఎవరూ ప్రవర్తించొద్దని.. ఎన్డీయే ఎంపీలంతా పార్లమెంటరీ విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలని ప్రధాని సూచించారు.ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా అధికార పక్ష ఎంపీలకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన సభ్యులు నిబంధనల విషయంలో సీనియర్లను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కాంగ్రెస్, రాహుల్గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. సమావేశంలో మోదీ ప్రసంగం వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. సోమవారం పార్లమెంట్లో ప్రతిపక్ష నేత ప్రవర్తించిన తీరు అమర్యాదకరం. స్పీకర్ స్థానాన్ని ఆయన అవమానించారు. ఆయనలా ఎన్డీయే సభ్యులెవరూ ప్రవర్తించొద్దు. కొన్ని దశాబ్దాల పాటు ప్రధాని కుర్చీని ఓ కుటుంబం తన గుప్పిట్లో ఉంచుకుంది. కానీ మా ప్రభుత్వం దేశ నేతలందరికీ సమాన గౌరవం ఇస్తుంది. పార్టీలకు అతీతంగా దేశంలోని ప్రతీ ఎంపీ తమ కుటుంబసభ్యులతో కలిసి ప్రధానమంత్రి సంగ్రహాలయ్ (గతంలోని నెహ్రూ మ్యూజియం)ను సందర్శించాలి. అందులో మాజీ ప్రధాని నెహ్రూ నుంచి మోదీ వరకు ప్రధానుల ప్రయాణాన్ని అందంగా ప్రదర్శించారు. వారి జీవిత విశేషాలను మనమంతా తెలుసుకోవాలని ప్రధాని ఎంపీల (ఔఆం ఓఖబ)కు సూచించినట్లు రిజిజు తెలిపారు. ఎంపీలు తాము మాట్లాడాలనుకున్న అంశంపై ముందుగానే అధ్యయనం చేయాలని మోదీ తెలిపారు.

## గత ప్రభుత్వ విధానాలతో నిర్మాణరంగం కుదేలు



**ఇసుక మాఫియాతో దెబ్బతిన్న సామాన్యులు**
**ఉచిత ఇసుక పాలసీతో గతంలో మంచి ఫలితాలు**
**ధరల పెరుగుదలపైనా కార్యాచరణ సిద్ధం**
**అధికారులు, మంత్రులతో సమీక్షలో సిఎం చంద్రబాబు**

అమరావతి,జూలై2 : గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు అనేక సమస్యల్లో ఉన్నారని, వాటి పరిష్కారా నికి సత్వర చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు నాయుడు దిశానిర్ధేంశం చేశారు. ధరల పెరుగుదల వల్ల సామాన్యులు ఇక్కట్లు పడుతున్న ందున ధరల నియంత్రణపైనా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత, నూతన ఇసుక పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇసుక, రోడ్లు, నిత్యావ సర వస్తువుల ధరల నియంత్రణపై సచివాలయంలో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వరుసగా సమీక్షలు నిర్వహించారు. పాలనలో మార్పు స్పష్టంగా కనిపించేలా.. అధికారులు వేగంగా పని చేయాలని తేల్చిచెప్పా రు. 2014 నుంచి 2019 వరకు ఇసుక సరఫరాలో అమలు చేసిన పాలసీలను, ఆ తరువాత వైకాపా ప్రభుత్వం తెచ్చిన విధానాలను అధికారులు వివరించారు. 2016 లో తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ వల్ల వచ్చిన ఫలితాలు... తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పాలసీలు మార్చ డం వల్ల జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ విధానాలతో ఇసుక కొరత, ధరల భారంతో నిర్మాణ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొందని అధికారులు తెలిపారు. ఇసుక క్వారీల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలకు ఇసుక క్వారీలను అప్పగిం చడంతో సరఫరా, అమ్మకాల్లో ఇబ్బందులు వచ్చాయ న్నారు. సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్, ఆన్లైన్ విధానం సరిగా లేకపోవడం వల్ల అక్రమాలు జరిగా యని వివరించారు. ప్రైవేటు ఏజెన్సీలు ఎంత మేర తవ్వకాలు జరిపాయి, ఎంత మేర అమ్మకాలు జరిపాయనే విషయంలో కూడా ఎలాంటి పరిశీలన, పర్యవేక్షణ జరగలేదని వెల్లడించారు. తక్షణం నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుకను అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని సీఎం .. అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని చంద్రబాబు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో రోడ్లను బాగు చేయడం ఒక విధానం అయితే... తక్షణం ప్రజల కష్టాలు తీర్చేందుకు రహదారులపై గుంతలు పూడ్చడం, వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై దృష్టి సారించా లని సూచించారు. ఎన్ని కిలోమీటర్ల మేర రోడ్లు.. ఏ మేర దెబ్బతిన్నాయి అనే విషయంలో సత్వరమే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి సాంకేతికంగా అందుబాటు లోకి వచ్చిన కొత్త విధానాలపై అధ్యయ నం చేయాలని దిశానిర్దేశర చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న ప్పటికీ వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై ప్రణాళికను రూపొందిం చాలని ఆదేశించారు. ఆర్థిక సమస్య లు ఉన్నా... ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్ల మరమ్మ తులకు ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. నిత్యావ సర సరకుల భారం తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశిం చారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిత్యావ సర సరకుల ధరలపై వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లై శాఖల అధికారులు, మంత్రులతో సమీక్ష చేశారు. బియ్యం, కందిప ప్పు, టమోటా, ఉల్లి ధరల నియంత్ర ణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షిం చారు. డిమాండ్ కు సరిపడా సరఫరా లేక కంది పప్పు ధర అంతకంతకూ పెరుగుతోందని అధికారులు తెలి పారు. అలాగే టమోటా, ఉల్లిపాయల ధరలు ఒక్కోసారి అనూహ్యంగా పెరగడం వల్ల ప్రజలపై భారం పడుతోందని వెల్లడించారు. ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిం చారు. నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు ఆయా సరుకుల దిగుమతులకోసం అవసరమైన చోట కేంద్రంతో సంప్రదిం పులు జరుపు దామని సీఎం అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 122 రైతుబ జార్లు ఉన్నాయని అధికారులు చెప్పగా, నిర్వహణ సరిగా లేక వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరడం లేదని చంద్రబాబు అన్నారు.

## రాష్ట్రంలో కొత్తగా పలు జిల్లాలకు కలెక్టర్లు

**11మందిని బదిలీ చేస్తూ సిఎస్ ఉత్తర్వులు**
**శ్రీకాకుళం జిల్లా కలెక్టర్గా స్వప్నిల్ దినకర్**

అమరావతి,జూలై2: రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారు లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగ ళవారం బదిలీ చేసింది. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్గా స్వప్నిల్ దినకర్ను బదిలీ చేసింది. ఇక పార్వతీపురం జిల్లా కలెక్టర్గా ఏ శ్యామ్ ప్రసాద్ని నియమించింది. అనకాపల్లి జిల్లా కలెక్టర్గా కె. విజయ, కోనసీమ జిల్లా కలెక్టర్గా మహేష్ కుమార్ , పల్నాడు జిల్లా కలెక్టర్గా పి. అరుణ్ బాబు, నెల్లూరు జిల్లా కలెక్టర్గా ఆనంద్, తిరుపతి జిల్లా కలెక్టర్గా డి. వెంకటేశ్వర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకురి శ్రీధర్, కడప జిల్లా కలెక్టర్గా తోలేటీ శివశంకర్, సత్యసాయి జిల్లా కలెక్టర్గా చేతన్, నంద్యాల జిల్లా కలెక్టర్ బి. రాజకుమారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్గా హరేందిరా ప్రసాద్ను నియమించింది.

## విజయవాడ చేరుకున్న మాజీ సిఎం జగన్



**ఘనంగా స్వాగతం పలికిన వైకాపా నేతలు**
**నేరుగగా తాడేపల్లి నివాసం చేరిక**

విజయవాడ,జూలై2: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి తాడేపల్లి నివాసానికి తిరిగి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో విజయవాడ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఆయనకు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. వెల్లంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్ లతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు ఎయిర్ పోర్టుకు వచ్చారు. వారంతా సీఎం సీఎం అనే నినాదాలు చేశారు. జగన్ వారినందర్నీ పలకరిస్తూ వెళ్లారు. కొంత మంది కార్యకర్తల దగ్గరకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా తాడేపల్లి నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసే వరకూ తాడేపల్లి నివాసంలో ఉన్నారు. ఆ తర్వాత స్పీకర్ ఎన్నికలో కూడా పాల్గొనకుండా పులివెందుల పర్యటనకు వెళ్లారు. అక్కడ మూడు రోజులుగా ఉన్న తర్వాత బెంగళూరు వెళ్లారు. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుని ఆయన తిరిగి తాడేపల్లికి వచ్చారు. ఇక నుంచి పార్ట ఓటమిపై ఆయన సమీక్షలు చేసే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈవీఎంలను నిందిస్తూ కూర్చుకోవడం కన్నా వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఓటమికి కారణాలను విశ్లేషించుకోవడం మంచిదని భావిస్తున్నారు. కొంత మంది సీనియర్ నేతలతో జగన్ ఇప్పటికే సమావేశం అయ్యారు. అయితే అవన్నీ క్యాజువల్ మీటింగ్స్. ఓటమికి కారణాలు తేల్చే సమావేశాలను ఇంకా పెట్టలేదు. ఇప్పుడు నియోజకవర్గాల వారీగా లేదా జిల్లాల వారీగా సమవేశాలు పెట్టాలని అనుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం.. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమ కేసులు, దాడులు వంటి ఘటనలన్నింటినీ బయటకు తీసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది నేతలు ఆజ్ఞాతంలోకి వెళ్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో క్యాడర్ కు భరోసా ఇచ్చేందుకు జగన్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడిన ఘటనల్లో బాధితుల్ని పరామర్శిస్తానని అందరికీ అండగా ఉంటానని ప్రకటించారు. వైసీపీ ఓడిపోయిందని చాలా మంది ఆత్మహత్యలు చేసుకోవడం .. మనస్తాపంతో గుండెపోటుకు గురవడం వంటి ఘటనల్లో పెద్ద ఎత్తున జనం చనిపోయారని వారందరికీ ఓదార్పునిచ్చేలా యాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే చెప్పారు. డిసెంబర్ లేదా జనవరి నుంచి యాత్ర ప్రారంభమవుతుందని జగన్ చెప్పారు. ప్రభుత్వంపై ఇప్పుడే విమర్శలు చేయబోమని .. తాము సమయం ఇస్తామని .. ఆరు నెలల తర్వాత హామీల అమలును చూసి ఉద్యమిస్తామని వైసీపీ నేతలు చెబుతున్నారు.

## ఏపీలో మహిళల అదృశ్యంపై క్యాబినెట్లో చర్చించి నిర్ణయం : పవన్కల్యాణ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్లో గత కొన్ని సంవత్సరాలుగా అదృశ్యమైన మహిళల జాడ కోసం క్యాబినేట్లో చర్చించి ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పుతామని డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏపీలో 30 వేల మంది మహిళలు అదృశ్యం కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఓ కుటుంబం తనకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు 48 గంటల్లో మహిళా జమ్ము(ఏజీఎఎబీ) లో ఉందని గుర్తించిన పోలీసు యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. పోలీసులు తీసుకున్న చర్యల వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు.పోలీసులు తలుచుకుంటే కొంత సత్ఫలితాలు సాధిస్తారని, ఏపీ పోలీసుల పై ఆ నమ్మకం ఉందని అన్నారు. గత ఐదేండ్ల వైసీపీ పాలనలో అనేక మంది తల్లులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ శాఖలో సిబ్బంది కొరత ఉందని వాటిని భర్తీ చేయడంపై చర్చ జరుగాలని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సక్రమంగా ఉంటే పెట్టుబడులు వస్తాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. కోతకు గురైన ఉప్పాడ సముద్ర తీరాన్ని సందర్శిస్తానని అన్నారు.



## ఎబివిపి సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి



హైదరాబాద్,జూలై2: టీజీపీఎస్సీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ నిర్వహించా న్నారు. గ్రూప్–1 మెయిన్స్కి 1:100 పిలువాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల సంఖ్య పెంచే వరకు ఉద్యమిస్తామని ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీ స్పష్టం చేశారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి మోసం

**టీజీపీఎస్సీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి**
**విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రూప్–2, 3తోపాటు ఉపాధ్యాయ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట చేశారు. ఈక్రమంలో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఒక్కొక్కరిగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. టీఎస్పీఎస్సీ కార్యాల యాన్ని ఏబీవీపీ విద్యార్థులు ముట్టడి కి యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం టీఎస్పీఎస్సీ కార్యాలయానికి ముట్టడించేందుకు ఏబీవీపీ యత్నిం చగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు వచ్చిన వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది.

# సంపాదకీయం

బుధవారం 03-07-2024

## పడగొట్టిన ప్రజాస్వామ్యం ..తొడగొడుతోంది !

చాలాకాలం తరవాత అంటే...పదేళ్ల తరవాత పార్లమెంటులో ప్రజాస్వామ్యం కనిపిస్తోంది. గతంలో లాగా ప్రధాని మోడీ కాలర్ ఎగరేసే పరిస్థితి లేదు. పూర్తిస్థాయి మెజార్టీ లేకపోవడంతో..చిన్నచూపు చూసిన నేతల ముందు మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాగే విపక్షం కూడా బలంగా ఉంది.దేశ ప్రజాస్వామ్యంలో ఇదో మార్పుగా చూడాలి. అందుకే పార్లమెంటులో చర్చలకు అవకాశం వస్తోంది. విపక్ష సభ్యులు స్వేచ్ఛగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. స్పీకర్ ఓం బిర్లా కూడా విపక్ష సభ్యులకు గౌరవం ఇచ్చి వారిని చర్చలో పాల్గొనేలా చేస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంలో భాగంగా విపక్షనేత రాహుల్, సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటులో నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందులో తప్పులు తీసేస్తే..నిజాలు కూడా చాలా ఉన్నాయి. వారి విమర్శలను సూచనలుగా తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందని మోడీ గుర్తించాలి. పార్లమెంటులో ఈ పరిణామం ఇక బిజెపిలో కూడా రావాల్సి ఉంది. ఎందుకంటే బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఏ అంశంపైనా, తీసుకునే నిర్ణయంపైనా పార్టీలో చర్చించిన దాఖలాలు లేవు. గత పదేళ్లుగా నిరంకుశ విధానాలు సాగాయి. దేశం ఎటు పోతుందో ..ఏ నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియదు. ఎంతో హుందాగా, దేశం కోసం వాజ్‌పేయ్, అద్వానీ లాంటి వారు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసి,ప్రజల్లో కొత్త ఆశలను నింపారు. బిజెపిని ప్రజాస్వామ్య పార్టీగా, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా తీర్చిదిద్దారు. కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పెద్దలంతా తెరమరుగయ్యారు. పాతతరం నేతలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక క్రమపద్దతిలో వారిని తప్పించారు. పార్టీలోనూ,పార్లమెంట్ లోనూ సీనియర్లు అన్న వాసన లేకుండా చేశారు. ఇప్పుడు పార్టీలో ఇద్దరి పెత్తనమే సాగుతోంది. అందుకే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడ్డది. చాయ్‌వాలాగా చెప్పుకుంటున్న మోడీ అధికారం చేపట్టిన తరవాత చేస్తున్న విన్యాసాలతో భారత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గత యూపిఎ ప్రభుత్వాన్ని గద్దె దింప, మోడీని అందలం ఎక్కించినందకు పదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్యాస్ ధరలు, జిఎస్టీ వాతలు చాలు.. ఈ దేశ ప్రజలు ఎంతగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారో చెప్పడానికి. ఇకపోతే నిరుద్యోగం ఎలాగూ పెరిగింది. ఉద్యోగ కల్పన లేదు. చివరకు ఆర్మీలో కూడా అగ్నివీర్ పథకం పేరుతో నాలుగేళ్ల సర్వీస్‌తో ఉద్యోగాల భర్తీ మొదల య్యింది. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నద ఇచూడాలి. ఇకపోతే ఉద్యోగాల భర్తీ అన్నదే మర్చి పోయారు. సంస్థలను తెగనమ్మేయడం, బ్యాంకులను ముంచినోళ్లు దేశం దాటివెళ్లినా..చూస్తూ ఉండడం చూస్తున్నాం. ప్రజలు మామూలు బట్టలు కూడా కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మోడీ మాత్రం ఖరీదైన సూట్లు వేస్తుంటారు. కట్టిన బట్ట మళ్లీ కట్టకుండా రంగురంగుల ఖరీదైన బట్టలు వేస్తున్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ఇంతగా ఎదిగనందుకు భారతీయ ప్రజలు ఆనందించాల్సిందే. అలా అందరూ ఎదిగితేనే మనదేశ జిడిపి, ఆర్థిక వ్యవస్థ బాగా ఎదిగినట్లుగా మోడీ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి. ఈ క్రమంలో పదేళ్ల కాలం గిర్రున తిరిగింది. అయోధ్య, 370 ఆర్టికల్ పేరు చెప్పి ఓట్లు అడిగినా ప్రజలు నమ్మలేదు. మోడీ పాలనలో నిజాయితీ లేదని గుర్తించారు. అందుకే అయోధ్యలోనూ ఓడించారు. ఇవన్నీ సత్యాలు. ఈ సత్యాలు మాట్లాడితే మోడీకి కోపం వస్తుంది. గత పదేళ్లలో విపక్షం గట్టిగా లేకపోవడం వల్ల వారిని గెంటివేసి పాలన చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భారత ప్రజాస్వామ్యం గొప్పదనం ఇప్పుడు కనిపిస్తోంది. గడచిన పదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే అవకాశం వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించిన అతిశయాలను ఎండగట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం సొంత డబ్బా కొట్టుకునేలాపాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. పేపర్ లీక్ దోషుల్లో ఇసుమంత భయం కూడా లేకుండా పాలన సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా ప్రస్తావించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని పదేపదే విమర్శిస్తున్నా వాటిగురించి ప్రస్తావించ కుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా చర్చనీయాంశమైన అగ్నిపథ్ ఊసే ఎత్తలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ ఇక గతంలో చూశాం. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో కృషి జరిగిందని చెప్పుకోవడం దారుణం. వ్యవసాయ చట్టాలను తేవడం, వదిలించుకోవడం కూడా జరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా బిజెపికి సొంతంగా మెజార్టీని ఇవ్వలేదు. అయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించా లని ప్రయత్నిస్తున్నారు. అందుకే బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మొహమాటంగా అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్దాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదా లో తొలిసారిగా మాట్లాడారు. నిజంగా గతంలో ఇలా మాట్లాడే అవకాశం ఎవరికీ లేదు. ఇప్పుడు విపక్ష సభ్యులు మాట్లాడే అవకాశం తెచ్చుకున్నారు. అధికార కూటమితో తలపడేంతగా విపక్ష బలం పెరిగింది. రాహుల్, అఖిలేశ్ యాదవ్ల ప్రసంగంలో పచ్చి నిజాలు ఉన్నాయి.

## 6న చంద్రబాబు, రేవంత్ సమావేశం..! హరీశ్‌రావు డిమాండ్ ఇదే..!!




హైదరాబాద్ : ఈ నెల 6వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు హైదరాబాద్ నగరంలో భేటీ అవుతున్నట్లు పలు వార్తా పత్రికల్లో కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ కథనాలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కీలక డిమాండ్ చేశారు.ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర విభజన సమస్యల మీద చర్చించడానికి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లు పత్రికల్లో చూశాం. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలనుకోవడం సంతోషం. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తొలిరోజుల్లో ఏడు మండలాలను, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును అన్యాయంగా ఏపీలో కలిపారు. దీంతో తెలంగాణ రాష్ట్రం ఎంతగానో నష్టపోయింది. ఈ అంశంపై పదవీ బాధ్యతల స్వీకరణ కంటే కొద్ది గంటల ముందే తీవ్రంగా కేసీఆర్ స్పందించారు. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చాం. పార్లమెంట్‌లో నిరసన తెలిపి బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేశాం. కానీ బీజేపీ బిల్లును ప్రవేశపెట్టింది. ఆ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు.ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబుపై ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉంది. కాబట్టి రేవంత్ రెడ్డి చంద్రబాబు మీద ఒత్తిడి తెచ్చి ఏడు మండలాలు, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టు తెలంగాణకు వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నాం. ఏడు మండలాలు వచ్చిన తర్వాతనే విభజన సమస్యలపై ముందుకు పోవాలి. వారు పోలవరం కట్టుకుంటే అభ్యంతరం లేదు. భద్రాచలం వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు స్థలం లేకుండా పోయింది. భద్రాచలంలో సేకరించిన చెత్త వేడాయినికి డంప్ యార్డుకు కూడా స్థలం లేదు. ఆ ఏడు మండలాల ప్రజలు తెలంగాణతో ఉండాలని కోరుకుంటు న్నారు. ఏడు మండలాలను తిరిగి ఇవ్వాలనేది మొదటి ఎజెండాగా పెట్టుకోవాలి. దీని కోసం రేవంత్ రెడ్డి ఒత్తిడి తేవాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## రాహుల్ వ్యాఖ్యల్లో తప్పేముంది..? : ఉద్ధవ్ ఠాక్రే

న్యూఢిల్లీ:లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగ భాగాలను, కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడం విచారకరమని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ ఏం తప్పుగా మాట్లాడారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఠాక్రే మంగళవారం ముంబైలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో శివుడి ఫొటోను చూపేందుకు రాహుల్‌ను అనుమతించలేదని, ఇదేనా హిందూత్వ అంటే అని ప్రశ్నించారు.ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ర్యాలీల్లో బహిరంగంగా జై శ్రీరాం అని అన్నారని, అయితే బీజేపీయేతర సభ్యులు ఒకరు సభలో ఇలా నినదిస్తే అది నేరమవుతుందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నిన్నటి ప్రసంగంలో ఎక్కడా హిందువులను అవమానించలేదని అన్నారు. బీజేపీ అంటే హిందూత్వ కాదని రాహుల్ విస్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. తామంతా హిందువులమేనని, తాము ఎవరం హిందుత్వను అవమానించబోమని, హిందుత్వను ఎవరూ అవమానించేందుకు తాము అనుమతించమని, రాహుల్ కూడా తమలో భాగమేనని ఠాక్రే స్పష్టం చేశారు.




ఇక రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం లోక్‌సభలో చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడం కలకలం రేపుతోంది. రాహుల్ వ్యాఖ్యలపై పాలక పక్షం అభ్యంతరాలతో స్పీకర్ ఆదేశాలకు అనుగుణంగా నిర్దిష్ట వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్టు లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొంది. ఈ అంశంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడంపై విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాఖ్యలను పునరుద్ధరించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. తన వ్యాఖ్యలను తొలగించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీలో 3035 కొలువులకు సర్కార్ గ్రీన్ సిగ్నల్! త్వరలో నోటిఫికేషన్

హైదరాబాద్, జులై 2: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఖాళీగా ఉన్న 3,035 పోస్టుల భర్తీకి రేవంత్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిన అన్ని పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం పోస్టుల్లో 2000 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు, 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్) పోస్టులు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) పోస్టులు, 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) పోస్టులు, 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ పోస్టులు, 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్) పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్ (జనరల్) పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) కొలువులు ఉన్నాయి.ఆర్టీసీలో వివిధ కేటగిరిల్లో ఖాళీగా ఉన్న 3035 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు టీజీఎస్‌ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, ప్రజా రవాణా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ తమ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తోందని ఆయన అన్నారు.ఈ కొత్త రక్తంతో రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని ఆయన చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియమకాలు చేపడుతున్నట్లు వివరించారు. 3035 పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.




## ఎన్డీయే హయాంలో చేపట్టిన నిర్మాణాలు కుప్పకూలుతున్నాయ్ : కేసీ వేణుగోపాల్




న్యూఢిల్లీ:ఎన్డీయే హయాంలో చేపట్టిన ప్రతిష్టాత్మక నిర్మాణాలన్నీ కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ విమానాశ్రయం పైకప్పు కూలిందని, జబల్‌పూర్ ఎయిర్‌పోర్ట్ రూఫ్ కూలిందని, రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్ కనోపీ ధ్వంసమైందని వివరించారు. అయోధ్యలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని, రామ్ మందిర్‌లో లీకేజీలు, ముంబై హార్బర్ లింక్ రోడ్డులో పగుళ్లు చోటుచేసుకున్నాయని చెప్పారు.బిహార్‌లో మూడు వంతెనలు కుప్పకూలగా, ప్రగతి మైదాన్ టన్నెల్ నీటి మునిగిందని తెలిపారు.ఈ నిర్మాణాలన్నీ ఎన్డీయే హయాంలో చేపట్టినవేనని వెల్లడించారు. వారి పాలనలో ప్రతి భవనం కూలిపోయే ముప్పు కలిగిఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అతిపెద్ద కుంభకోణం ఎన్నికల బాండ్ల స్కామ్ అని, ఎన్నికల బాండ్ల వ్యవహారంపై విచారణ జరిపించాలని కేసీ వేణుగోపాల్ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు.మరోవైపు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో తన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను ప్రభుత్వం రికార్డుల నుంచి తొలగించడంపై విపక్ష నేత రాహుల్ గాంధీ విస్మయం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విఘాతమని స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. రికార్డుల నుంచి తొలగించిన వ్యాఖ్యలను పునరుద్ధరించాలని స్పీకర్‌కు రాసిన లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు.కాగా, రాహుల్ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ తాజాగా వెల్లడించింది. స్పీకర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. హిందువులు, ప్రధాని మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్ఎస్, అగ్నివీర్, నీట్ పరీక్షల్లో అక్రమాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను తొలగించినట్లు వివరించింది.

## రాహుల్ చెప్పిందంతా నిజం.. ఎందుకు రికార్డుల్లోంచి తొలగించారు..? : రేణుకా చౌదరి




న్యూఢిల్లీ:లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా సోమవారం రాహుల్‌గాంధీ చేసిన హిందూత్వ వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు, ఫైర్ బ్రాండ్ రేణుకా చౌదరి స్పందించారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని రికార్డుల్లోంచి ఎందుకు తొలగించారని ప్రశ్నించారు.'రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని వాళ్లు ఎందుకు రికార్డుల్లోంచి తొలగించారు..? అందులో ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలు వాళ్లకు ఏం కనిపించాయి..? రాహుల్‌గాంధీ ఏదైతే మాట్లాడిండో అది కరెక్ట్. నేనొక హిందువుగా చెబుతున్నా.. అసలైన హిందువులు హింసను ప్రేరేపించరు' అని రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు. వీళ్లకు (బీజేపీ నేతలకు) డ్రమ్స్ వాయిస్తూ అది తప్పు, ఇది తప్పు అని చెప్పడం అలవాటుగా మారిపోయిందని ఎద్దేవా చేశారు.'వీళ్లు (బీజేపీ నేతలు) డ్రమ్స్ వాయిస్తారు. ఇది తప్పు అంటారు. అది తప్పు అంటారు. ఆఖరికి మల్లికార్జున్ ఖర్గే ప్రసంగాన్ని కూడా వీళ్లు రికార్డుల నుంచి తొలగించారు. వాళ్లు ఏం చేయాలనుకుంటే అది చేస్తున్నారు. వాళ్ల ఇష్టమొచ్చినట్టు సభను నడుపుతున్నారు. ఇక ముందైనా వాళ్లు ప్రజల గొంతు వినేలా మేం చేస్తాం' అని రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు.

## ఇంకా ప్రజల వద్దే రూ.7581 కోట్లు

ముంబై, జూలై 2, చెలామణి నుంచి తొలగించిన రూ.2000 నోట్లలో 97.87 శాతం తిరిగి బ్యాంకులకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. అయితే రూ.7,581 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ ప్రజల వద్ద ఉన్నాయని ఆర్బీఐ తన డేటాలో వెల్లడించింది. 2023 మే 19న చలామణిలో ఉన్న రూ. 2000 నోట్లను ఉపసంహరించుకోవాలని ఆర్‌బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. మే 19, 2023న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న రూ.2000 డినామినేషన్ బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ.3.56 లక్షల కోట్లు. జూన్ 28, 2024న వ్యాపారం ముగిసే సమయానికి రూ.7,581 కోట్లకు తగ్గిందిరూ.2000 నోట్లలో 97.87 శాతం జూన్ 28, 2024 నాటికి బ్యాంకులకు తిరిగి వచ్చినట్లు సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో మార్పిడి సౌకర్యం అందుబాటులో ఉంది. మే 19, 2023 నుండి, రూ. 2000 బ్యాంకు నోట్లను మార్చుకునే సదుపాయం కూడా రిజర్వ్ బ్యాంక్ 19 ఇష్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంది.అక్టోబర్ 7, 2023 గడువు ముగిసిన తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఇష్యూ కార్యాలయాలు అక్టోబర్ 9, 2023 నుండి వ్యక్తులు, సంస్థల నుండి రూ. 2000 నోట్లను వారి బ్యాంక్ ఖాతాలలో డిపాజిట్ చేయడానికి స్వీకరిస్తున్నాయి.

# పవర్ చూపిస్తున్న నాదెండ్ల మనోహర్



కాకినాడ, జూలై 2, ఆంధ్రప్రదేశ్ లో కొత్త మంత్రి వర్గం ఏర్పాటయి పక్షం రోజులు కూడా కాలేదు. అయితే మంత్రులు అందరితో పోలిస్తే నాదెండ్ల మనోహర్ తన స్పెషాలిటీ చూపిస్తున్నారు. తనకున్న అనుభవాన్ని ఆయన ఉపయోగించి మరీ ఆయన తనకు కేటాయించిన శాఖలో ప్రక్షాళన చేపడుతున్నారు. అవినీతి ఎక్కువగా కనిపించే శాఖల్లో ఒకటి పౌర సరఫరాల శాఖ ఒకటి. ఈ శాఖ ద్వారా పేదలకు సక్రమంగా సేవలందిస్తే ఇటు ప్రభుత్వానికి, అటు పార్టీకి మంచి పేరు వస్తుంది. పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాదెండ్ల మనోహర్ తొలి రోజే ఆ శాఖల ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. సమీక్షలతో సరిపెట్టకుండా... కేవలం సమీక్షలతో సరిపెట్టలేదు. ఆయన ఫీల్డ్ లెవెల్ కు వెళ్లి మరీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల గోదాముకు వెళ్లి ప్రజలకు అందించే బియ్యం, పంచదార, నూనె వంటి వస్తువుల్లో నాణ్యతను పరిశీలించారు. నూనె, పంచదార తక్కువ తూకంతో ఉన్నట్లు కనుగొన్న నాదెండ్ల మనోహర్ అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డర్స్ పాస్ చేశారు. తూకం సక్రమంగా లేకపోతే ఊరుకునేది లేదని గట్టి వార్నింగ్ లు పంపారు. తూకం తక్కువయితే అందుకు ఉన్నతాధికారులనే బాధ్యులను చేస్తానని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖను గాడిన పెట్టాలంటే ముందు ఉన్నతాధికారులను కంట్రోల్ లో పెట్టాలని ఆయన తీసుకుంటున్న నిర్ణయం సత్ఫలితాలనిస్తున్నాయి.. ఇక అంతటితో ఆగలేదు. కాకినాడ వెళ్లారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం దారి మళ్లుతుందని గత ఎన్నికల సందర్భంగా జనసేన, టీడీపీ అగ్రనేతలు ఆరోపించారు. ఇందులో నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు నాదెండ్ల రెండు రోజుల పాటు కాకినాడలోనే మకాం వేశారు. అధికారులతో సమీక్ష నిర్వహించి ఊరుకోలేదు. కాకినాడలో రేషన్ మాఫియా ఆటకట్టించేందుకు గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. 7,615 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అందరినీ ఆశ్చర్య పరిచారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ సరుకులు ఇతర దేశాలకు మళ్లుతున్నాయని ఆయన తనిఖీల తర్వాత ఆరోపించారు. కాకినాడ పట్టణ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబీకుల హస్తం ఉందని ఎన్నికల సమయంలోనూ పవన్ కల్యాణ్ ఆరోపించారు. దీంతో కాకినాడపై నాదెండ్ల స్పెషల్ ఫోకస్ పెట్టారు. కాకినాడలో తొలిరోజు ఆరు గోదాముల్లో లోపాలున్నట్లు గుర్తించామని నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కాకినాడలో వ్యవస్థీకృతమైన మాఫియా ఉందని, రేషన్ మాఫియా అక్రమాలపై సీబీఐ విచారణను తాము కోరనున్నట్లు నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సొంత నౌకను ఏర్పాటు చేసుకుని కాకినాడ పోర్టు నుంచి ఎవరు రేషన్ సరుకులను తరలిస్తున్నారో వారికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. నాదెండ్ల మనోహర్ ఫీల్డ్ లెవెల్ విజిట్స్ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. జనసేన పార్టీకి చెందిన మంత్రిగా ఆయన తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రత్యేకంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా నాదెండ్ల పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించినట్లు తెలిసింది.

అడ్డంగా బుక్కైన ద్వారంపూడి

రేషన్ బియ్యం స్కామ్‌ను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ స్కామ్‌లో కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. రెండు రోజులుగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో మకాం వేశారు. కాకినాడ సిటీలో, పోర్టులో స్వయంగా మంత్రి నాదెండ్ల తనిఖీలు చేశారు. కాకినాడ పోర్టులో అశోక్ ఇంటర్నేషనల్, హెచ్ వన్ గోడౌన్లలో భారీగా రేషన్ బియ్యం గుర్తించారు.ఆ బియ్యాన్ని ఆఫ్రికాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం అందుకుని అధికారులు.. రెండు గోడౌన్లను సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అంతా.. ద్వారంపూడి ఫ్యామిలీ కనుసన్నల్లో జరిగిందటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాకినాడ పోర్టును ద్వారంపూడి.. తన అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నాడని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ద్వారంపూడి అరాచకాలు చూసి తానే ఆశ్చర్యపోయానని చెప్పుకొచ్చారు.తనిఖీలు పూర్తి అయ్యేంత వరకు పోర్టు నుంచి బియ్యం రవాణా నిలిపివేశారు. రాష్ట్రంలో పేదల పొట్ట కొట్టి అదే రేషన్ బియ్యాన్ని ఆఫ్రికన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారంటూ మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ సంబంధించి శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పూర్తిస్థాయి పరిశీలన జరిపాక.. సీఐడీతో విచారణ కూడా జరిపిస్తామని మంత్రి నాదెండ్ల అన్నారు

# మండలిలో ముందుకు ఎలా..

విజయవాడ, జూలై 2, ఏపీలో శాసనమండలిని రద్దు చేస్తారా? ఆ దిశగా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారా? వైసిపి ఆధిపత్యాన్ని గండి కొట్టాలంటే అదే మార్గమా? లేకుంటే ఇబ్బందికర పరిణామాలు తప్పవా? కీలక బిల్లులకు మోక్షం రాదా? అందుకే రద్దు చేయడం ఉత్తమమని భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రద్దు కంటే శాసనమండలిని అచేతన అవస్థలో పెట్టేందుకు ప్రయత్నిస్తారన్న టాక్ ప్రారంభమైంది. శాసనమండలిలో వైసీపీ ది స్పష్టమైన మెజారిటీ. 38 మంది వరకు ఎమ్మెల్సీలు వైసీపీకి ఉన్నారు. అందుకే జగన్ సైతం శాసనమండలిపై ధీమాతో ఉన్నారు. శాసనసభలో సంఖ్యా బలం లేకపోయినా.. శాసనమండలిలో అధికార పార్టీకి చెక్ చెప్పొచ్చని భావిస్తున్నారు. అందుకే ఓటమి ఎదురైన తర్వాత ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితోనే రాజకీయం నడపాలని స్ట్రాంగ్ గా డిసైడ్ అయ్యారు. అసెంబ్లీలో మనం లేకున్నా.. మండలిలో మనోళ్లే ఉంటారని.. వారే చూసుకుంటారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. అంటే అసెంబ్లీలో దక్కని అధికారాన్ని.. పరోక్షంగా మండలిలో వినియోగించుకునేందుకు వైసిపి ప్రయత్నిస్తుందన్నమాట. 2019 ఎన్నికల్లో 151 స్థానాలతో విజయం సాధించింది వైసిపి. కానీ శాసనమండలిలో మాత్రం ఆ పార్టీకి ప్రాతినిధ్యం అంతంత మాత్రమే. దీంతో కీలక బిల్లులను అప్పట్లో అడ్డుకోగలిగింది టిడిపి. అందుకే ఏకంగా మండలిని రద్దు చేసేందుకు నిర్ణయించారు జగన్. కానీ కేంద్రం అనుమతించకపోవడంతో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు అదే శాసనమండలిలో వైసిపి ప్రాతినిధ్యం పెరిగింది. శాసనసభలో అంతులేని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమికి శాసనమండలిలో తగినంత ప్రాతినిధ్యం లేదు. కీలక బిల్లులుగా భావిస్తున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అమరావతి నిర్మాణానికి సంబంధించిన మరికొన్ని బిల్లులు, ఆర్ ఫైవ్ జోన్లో పేదలకు ఇచ్చిన ఇళ్లను కూడా రద్దు చేయడం..వంటి బిల్లులు తీసుకొచ్చే అవకాశం ఉంది. కానీ శాసనమండలిలో వీటికి బ్రేక్ పడనుంది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి బిల్లును ఇక్కడ అడ్డుకునేందుకు అవకాశం మెండుగా కనిపిస్తోంది. అందుకే మండలిని రద్దు చేయాలన్న వాదన వినిపిస్తోంది. కూటమిలో సైతం బలమైన చర్చ సాగుతోంది. కానీ వచ్చే మూడేళ్లలో శాసనమండలిలో వైసిపి సంఖ్యాబలం తగ్గుతుంది. కూటమి సంఖ్యా బలం పెరుగుతుంది. అందుకే మండలిని రద్దు చేయడం కంటే.. సుప్త చేతనావస్థలో ఉంచేందుకు చూడాలని భావిస్తోంది. దీనిపై న్యాయ నిపుణుల సలహాలను చంద్రబాబు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి కొద్ది రోజుల్లో శాసనమండలిపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వైసీపీ అధినేత జగన్ నెక్ష్ట్ ప్లాన్ ఏంటి?



విజయవాడ, జూలై 2, వైసీపీ అధినేత జగన్ నెక్ష్ట్ ప్లాన్ ఏంటి? ప్రతిపక్ష హోదా ఇచ్చేది లేదని టీడీపీ చెప్పడంతో ఆయన అసెంబ్లీకి వస్తారా? నేతలకు ఎలాంటి సూచనలు ఇవ్వబోతున్నారు? ఇవే ప్రశ్నలు ఫ్యాన్ పార్టీ కార్యకర్తలను వెంటాడుతున్నాయి.ఏపీ మాజీ సీఎం జగన్ మంగళవారం బెంగుళూరు నుంచి నేరుగా విజయవాడకు వచ్చారు. ఎయిర్‌పోర్టు నుంచి తాడేపల్లికి చేరుకోనున్నారు. అధినేత రావడడంతో గన్నవరం ఎయిర్ పోర్టులో భారీగా స్వాగతం పలికారు. జూన్ 22న తాడేపల్లి నుంచి పులివెందులకు వెళ్లారు జగన్. మూడురోజులు ప్రజలు, నాయకులతో సమావేశమయ్యారు. 24న సతీసమేతంగా బెంగళూరుకు వెళ్లారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా గమనించారు జగన్. అధికారులను మార్చివేయడం, వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా దూరంగా పెట్టారు. ఈ క్రమంలో జగన్‌కు ఆయన వేగులు ఈ సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇంకో వైపు ప్రస్తుతం జగన్‌కు ఉన్న సెక్యూరిటీని కుదించాలనే ఆలోచన చేస్తోంది టీడీపీ సర్కార్. ఎక్కడికి వెళ్లినా భద్రత కోసం చట్టం తెచ్చుకున్నారాయన. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆ చట్టానికి మార్పులు చేయాలని భావిస్తోంది టీడీపీ ప్రభుత్వం.ఎన్నికల్లో ఓడిపోయిన వైసీపీ నేతలు జనసేన, బీజేపీ, కాంగ్రెస్ ముఖ్యనేతలతో టచ్‌లోకి వెళ్లారు. మంతనాలు కూడా సాగించారు. దీనిపై జగన్ వద్ద రిపోర్టు ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం తాడేపల్లి వచ్చాక నేతలతో మీటింగ్ పెట్టాలని ఆలోచన చేస్తున్నారట జగన్. రానివారు పార్టీకి దూరం అవుతారనే భావిస్తున్నారట.జగన్ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటీ, మరో ఆరునెలలు వాయిదా వేసుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే కొత్త ప్రభుత్వం ఇప్పుడే రావడంతో అప్పుడే ప్రజల్లోకి వెళ్లడం కరెక్టు కాదని అంటున్నారు. ఏడాది తర్వాత వెళ్తే.. టీడీపీ స్కీమ్‌ల వ్యవహారాన్ని బయటపెట్టవచ్చని అంటున్నారు. ఈ లెక్కన ఓపెన్‌గా టీడీపీ ప్రభుత్వంపై స్టేట్‌మెంట్ చేయకుండా లీ ద్వారా రియాక్ట్ అయితే బెటరన్నది ఆ పార్టీ అంతర్గత సమాచారం.

# సంక్షేమంతో పాటు స్వాంతన

విజయవాడ, జూలై 2,వైసీపీ అధినేత జగన్ ఓటమి నుంచి బయటపడి కొంత పాలన ఎలా చేయాలన్న దాని గురించి అనుభవజ్ఞులైన వారి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తన తండ్రి వైఎస్సార్ నుంచి చాలా నేర్చుకోవచ్చు. ఆయన పాలన ఎలా సాగించారో? ఎలా ప్రజలకు చేరువగా ఉండే వాళ్లో జగన్ కు తెలియనిది కాదు. ఎందుకంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనను జగన్ దగ్గరుండి చూశారు. ఆయన నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి పాటుపడే వారు. అందుకే వైఎస్సార్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీని రెండోసారి కూడా అధికారాన్ని అప్పగించారు జనం. ఇటు సంక్షేమంతో పాటు అటు అభివృద్ధిని కూడా పరుగులు తీయించడమే కాకుండా, వ్యక్తిగత సమస్యలను కూడా పరిష్కరించేందుకు వైఎస్సార్ చేసిన కృషి వల్లనే కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004, 2009 లో అధికారంలోకి రాగలిగింది. చంద్రబాబు నుచూసి జగన్ పాలన విషయంలో ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. ఈరోజు చూస్తే రాష్ట్రమంతటా పింఛన్ల పంపిణీ జరిగింది. ఇది ఇంటికి వెళ్లి ఇవ్వడం కొత్తగాదు. జగన్ హయాంలో వాలంటీర్లు ఇంటికి వెళ్లి ఇచ్చిందే. అయితే తాను అధికారంలోకి రాగానే చంద్రబాబు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లారు. వారికి స్వయంగా పంపిణీ చేశారు. రాష్ట్రమంతటా ఎమ్మెల్యేలను పింఛన్ల పంపిణీలో భాగస్వామ్యులను చేశారు. అంటే ఎమ్మెల్యేలకు పని అప్పచెప్పడమే కాదు.. వారిని ప్రజలకు చేరువయ్యేలా చంద్రబాబు తాను కూడా రంగంలోకి దిగి అందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఈరోజు ఏపీలో అధికార పార్టీ ఒకరకమైన సానుకూల వాతావరణం ఏర్పరచుకుంది. సచివాలయం సిబ్బందిని మాత్రమే పింఛన్లకు పంపలేదు. వారితో పాటు ఎమ్మెల్యేలను కూడా పంపారు. కానీ 136 సార్లు బటన్ నొక్కానన్నావు. 2.75 లక్షల కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశానని చెప్పావు. నిజమే కావచ్చు. కానీ పబ్లిసిటీ ఏదీ? తాడేపల్లి కార్యాలయంలో కూర్చుని బటన్ నొక్కినంత మాత్రాన సరిపోతుందా? లేక ఏదో ఒక జిల్లాకు వెళ్లి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినంత మాత్రాన ఒరిగేదుందా? వైఎస్సార్, చంద్రబాబుల కంటే సంక్షేమ పథకాలను ఎక్కువగా అమలు చేసినా జగన్ కు అంత మైలేజీ రాకపోవడానికి, పాజిటివిటీ జనంలో కనిపించకపోవడానికి కారణం జగన్ మాత్రమే. ఎవరినీ భాగస్వామ్యుల్ని చేయకపోవడం, అంతా తానే అయి వ్యవహరించడం, కూర్చున్న చోట నుంచి కదలకపోవడంతోనే మొన్నటి ఎన్నికల్లో ఘోర ఓటమి సంభవించిందన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. జనానికి దూరంగా ఉండాలనుకునే సీఎంను ఎవరు మాత్రం కోరుకుంటారన్న ప్రశ్నకు సమాధానం ఇప్పటికే దొరికి ఉంటుంది. చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినా ఈరోజు ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మరీ పింఛను ఇచ్చారంటే .. అది కేవలం ఆయనకే కాదు.. పార్టీకి, ప్రభుత్వానికి ఎంత పాజిటివ్ టాక్ వస్తుంది. ప్రజలకు కావాల్సింది కేవలం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేయడమే కాదు.. వారికి స్వాంతన చెప్పే మాటలు ఎప్పటికప్పుడు చెప్పాలి. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కూర్చుని మీడియాకు దూరంగా ఉండి కనీసం ఏం చేస్తున్నారో కూడా ప్రజలకు తెలియకపోతే వాళ్లు ఖచ్చితంగా విపక్షాలు చేసే విమర్శలు నమ్మక ఏమవుతుంది? అన్న విషయంఆలోచించాలి. చిన్న వయసులో వచ్చిన ముఖ్యమంత్రి పదవీకాలాన్ని ఎక్కువ సమయం తాడేపల్లి క్యాంప్ కార్యాలయానికే పరిమితం చేయడం కూడా ఓటమికి ఒక కారణంగా ఖచ్చితంగా చెప్పాలి. అందుకే వైఎస్సార్, చంద్రబాబుల నుంచి పాలన ఎలా చేయాలన్న దానిపై ఇప్పటికైనా కొంత తెలుసుకుంటే.. భవిష్యత్ లో ఇలాంటి తప్పులు దొర్లవన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న మాట.

# గిరిప్రదక్షిణ కోసం భారీ ఏర్పాట్లు



విశాఖపట్టణం, జూలై 2, జులై నెలలో ఆషాడ పౌర్ణమి రోజున సింహాచలంలో గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించనున్నారు. సింహాచలంలో సింహాద్రి అప్పన్నగా పిలిచే శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండ చుట్టూ 32 కిలో మీటర్ల మేర లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో కాలి నడకన చేరుకుంటారు.గిరి ప్రదక్షిణ కోసం సింహాచలం దేవస్థానం ఏర్పాట్లు చేస్తుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేస్తుంది. జులై 20వ తేదీన సాయంత్రం 4.00 గంటలకు కొండ దిగువన తొలిపావంచా (కొండ ఎక్కే మొదటి మెట్టు) వద్ద నుంచి పుష్ప రథం ప్రారంభం అవుతుంది. జులై 21న తుది విడత చందన సమర్పణ జరుగుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా జులై 20న రాత్రి 10.00 గంటల వరకు సింహాద్రి అప్పన్న దర్శనానికి భక్తులకు అనుమతి ఉంటుంది. జులై 21న విజయోత్సవం పురస్కరించుకొని సాయంత్రం 4.00 గంటల వరకే శ్రీవరాహ లక్ష్మీనరసింహం దర్శనం ఉంటుంది.గిరి ప్రదక్షిణ ప్రారంభోత్సవానికి ముందు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ధర్మకర్త, ఆలయ కార్యనిర్వహణాధికారి కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. ప్రారంభ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయి. వివిధ కార్యక్రమాల అనంతరం సాయంత్రం 4.00 గంటలకు శ్రీవరాహ లక్ష్మీనరసింహ దేవుని రథం లాగడంతో గిరి ప్రదక్షిణ ప్రారంభం అవుతుంది. కొంత మంది భక్తులు ఈ ప్రక్రియలో పాల్గొనేందుకు వేచి ఉంటారు. రథంతో పాటు నడిచి గిరి ప్రదక్షిణను పూర్తి చేస్తారు. అక్కడ నుంచి మెట్ల మార్గంలో సింహగిరి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. భక్తులంతా పాదాల కొండ దగ్గర ఉన్న విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి తమ ప్రదక్షిణ ప్రారంభిస్తారు. రథం ముందు చాలా మంది వాలంటీర్లు నృత్యం చేస్తారు.గిరి ప్రదక్షిణ రోజున పుష్ప రథం యాత్ర వెనుక లక్షలాది మంది ప్రజలు నడుస్తారు. 32 కిలో మీటర్ల మేర జరిగే ఈ ప్రదక్షిణ విశాఖపట్నం ప్రధాన ప్రాంతాల్లో సాగుతోంది. ఈ గిరి ప్రదక్షిణలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి పాల్గొంటారు. గిరి ప్రదక్షిణ సింహాచలం కొండ పాదాల వద్ద ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి జైలు రోడ్డు మీదుగా అడవివరం, ఆరిలోవ, హనుమంతవాక, జోడుగుళ్ల పాలెం బీచ్, మాధవధార, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం మీదుగా తిరిగి సింహాచలం ఆలయానికి చేరుకుంటుంది. అయితే పుష్ప రథం యాత్ర రూట్ కూడా దాదాపుగా అదే ఉంటుంది. అయితే కాలినడక గిరి ప్రదక్షిణ మార్గానికి, రథం మార్గానికి చిన్న తేడా ఉంటుంది. బీచ్ రోడ్డు వైపు రథం వెళ్లదు. అయితే సింహాచలం కొండ పాదాల నుంచి జైలు రోడ్డు మీదుగా అడవివరం, ఆరిలోవ, హనుమంతవాక నుంచి జాతీయ రహదారి (ఎన్‌హెచ్) 5 మీదుగా ఎన్‌డీఏ జంక్షన్, గోపాలపట్నం నుంచి తిరిగి సింహాచలం చేరుకుంటుంది. రథం వెంట ఉండే మొదటి బ్యాచ్ మాత్రం, రథం వెళ్లే మార్గం వైపే వెళ్తుంది. అయితే ఆ తరువాత మార్గనిర్దేశం చేసేవారు ఎవరు ఉండకపోవడంతో జనాలు రద్దీ భారీగా పెరగడంతో అప్పుడు రూటు మారిపోయి, బీచ్ రోడ్డు వైపు వెళుందిది.భక్తుల సౌకర్యార్థం సింహాచలం కొండ చుట్టూ 30 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. 275 మొబైల్ టాయిలెట్స్, కొండ చుట్టూ విద్యుత్ దీపాలు అలంకరణ, మంచినీటి సదుపాయం, సామియా నాలు, పెండళ్లు, కుర్చీల ఏర్పాటు, వైద్య శిబిరాలు, పారిశుధ్యం, పోలీసు భద్రత, జోడిగుళ్లపాలెం బీచ్ వద్ద గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచడం వంటి ఏర్పాట్లు చేస్తారు. అలాగే స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా తమ సేవలను అందిస్తాయి.

# అవమానం..అసహనం.. సీన్ కట్ చేస్తే-మంత్రిగా పార్థసారథి

విజయవాడ, జూలై 2, ధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నా అవమానాలు తప్పలేదు. ఐదేళ్లలో ఒకటి రెండు సార్లు తప్ప కనీసం ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కూడా ఇవ్వలేదు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసినా, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినా పెద్దగా ప్రాధాన్యత దక్కలేదు. చివరకు అవమానకర పరిస్థితుల్లో పార్టీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది.కృష్ణా జిల్లా పెనమలూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. నూజివీడు నుంచి పోటీ చేసి గెలిచి ఏకంగా మంత్రి కూడా అయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన పార్థసారథి 2014లో మచిలీపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో పెనమలూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు.ఉమ్మడి కృష్ణా జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉన్నా వైసీపీలో సారథికి అవమానాలు తప్పలేదు. 2014లో ఓటమి తర్వాత ఏపీ రాజధాని విజయవాడలో ఏర్పాటయ్యాక సుదీర్ఘ కాలం పార్టీ కార్యకలాపాలు సారథికి సంబంధించిన స్థలంలోనే సాగింది. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న విశాలమైన స్థలంలో పార్థసారథికి వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. ఆ స్థలాన్ని గతంలో వైఎస్ కుటుంబం నుంచి సారథి తండ్రి కేపీ రెడ్డయ్య యాదవ్ కొనుగోలు చేశారనే ప్రచారం కూడా ఉంది.విజయవాడ స్వరాజ్య మైదాన్ ఎదురుగా ఉన్నా దాదాపు రెండున్నర ఎకరాలకు

పైబడిన స్థలం కోట్లాది రుపాయల ఖరీదు చేస్తుంది. ఈ స్థలం వ్యవహారంలోనే వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి పార్థసారథికి మధ్య దూరం పెరిగినట్టు సన్నిహితులు చెబుతారు. 2014లో వైసీపీ ఓటమి పాలైన తర్వాత ఆ పార్టీ కార్యకలాపాలను ఏపీలో విజయవాడ కేంద్రంగా నడిపించాలని భావించినపుడు సారథి తన సొంత స్థలంలో తాత్కలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించారు. 2019 ఎన్నికలకు ముందే దానిని తాడేపల్లికి తరలించారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని సారథి భావించారు. ఆయనతో పాటు మంత్రులుగా పనిచేసిన బొత్స, పెద్దిరెడ్డి వంటి వారికి అవకాశం దక్కినా సారథికి మాత్రం ఆ ఛాన్స్ దక్కలేదు. మంత్రి వర్గ విస్తరణ సమయంలో సారథికి ప్రభుత్వ విప్ పదవి ఇస్తామని జగన్ హామీ ఇచ్చినా దానిని నిలబెట్టుకోలేదు.ఆ తర్వాత అనూహ్యంగా సారథికి తాడేపల్లిలో ఎంట్రీ కూడా నిలిచిపోయింది. దీనికి విజయవాడ ఎంజి రోడ్డులో ఉన్న స్థలమే కారణమని సన్నిహితులు చెబుతున్నారు. విజయవాడ స్థలాన్ని వైసీపీ కార్యాలయం కోసం ఇవ్వాలని కోరినా సారథి సుముఖత చూపకపోవడంతో ఆయన్ని కలిసేందుకు కూడా అనుమతించ లేదని తెలుస్తోంది. అదే సమయంలో జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం భూసేకరణలో ఆక్రమాలకు పాల్పడ్డారని విస్తృత ప్రచారం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలకు స్థల సేకరణలో భారీగా అక్రమాలు జరిగినా, సారథికి వ్యతిరేకంగా మాత్రమే ప్రచారం జరిగింది.కోట్లాది రుపాయల విలువైన భూమిని దక్కించుకోడానికి తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేసినట్టు ప్రచారం జరిగింది. చివరకు ఎన్నికలకు ముందే పెనమలూరు టిక్కెట్ ఇచ్చేది లేదని తేల్చేయడంతో సారథి తన దారి తాను చూసుకున్నారు. కృష్ణాజిల్లా నూజివీడు నుంచి పోటీ చేసి గెలిచారు. అనూహ్యంగా మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. వైసీపీ మరోసారి టిక్కెట్ ఇచ్చినా గెలిచే అవకాశాలు ఉండేవి కాదు.

## ఎమ్మెల్యే బీవీని సన్మానించిన ఆర్యవైశ్య సంఘ నాయకులు..





ఎమ్మిగనూరు జూలై 2 విభారే న్యూస్..ఎమ్మిగనూరు శాసనసభ్యులు డా.బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఎమ్మెల్యే గా గెలుపొందిన శుభ సందర్భంగా ఆయనను ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించి హార్థిక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తక్కశిల సుబ్రహ్మణ్యం, కార్యవర్గ బృందం పాల్గొనడం జరిగినది..

## పారిశుధ్యం మెరుగు పడాల్సిందే

---మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి






--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02- పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు . మంగళవారం పలు సచివాలయలలో పెన్షన్ పంపిణీ గురించి ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెళ్లే తాగునీరు పూర్తి సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఎమ్ ఈఈ రమణ మూర్తి కి ఆదేశించారు. పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఆయన అధికారులకు , సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంటువ్యాధుల సీజన్ కావడంతో ప్రజ లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు , ముఖ్యంగా తాగునీరు, తినుబండారాలు, పరిసరాల విషయంలో పౌరబాధ్యతను గుర్తు చేయాలని, అదే సమయంలో శానిటేషన్ యంత్రాంగం వారి విధులను మరింత చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. వార్డుల వారీగా శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళికా విభాగాలతో పాటు ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంక్ లో ఉన్న నిల్వ సంగతి తేల్చండి

---ఆలయ భూముల వేలంలో గోల్ మాల్

---నల్లగట్ల లో వెనుదిరిగిన అధికారులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02-: అర్లగడ్డ మండలం నల్లగట్ల లో ఆలయ భూముల కౌలుకు నిర్వహించిన వేలంలో గతంలో గోల్ మాల్ జరిగిందని రైతులు,తెలుగు దేశం నాయకులు. పెద్దలు వాపోయారు. మంగళవారం లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయ భూముల కౌలుకు ఈవో సాయి జయ చంద్రా రెడ్డి ఆధ్వ ర్యంలో వేలం పాట నిర్వహిం చారు. కాసేపు ఈవో కు , రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో బ్యాంకు లో నిల్వ ఎంత ఉందనేది విషయం తేలే వరకు వేలం నిర్వహించొద్దని రైతులు డిమాండు చేయడంతో ప్రక్రియను వాయిదా వేశారు. అలాగే చెన్నకేశవ స్వామి గుడి నిర్మాణానికి నిధులు తక్కువగా కేటాయించడం పై పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈవో, ఆలయ అధికారులు అక్కడ నుంచి వెళ్లి పోయారు. గత ప్రభుత్వంలో అధికారులు, నాయకులు ఆలయ భూముల డబ్బుల్ని గోల్మాల్ చేసేశారని, అవన్నీ ఎక్కడికి వెళ్లాయో తెలియాలని, వాటిని రికవరీ చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులు, గ్రామ పెద్దలు డిమాండు చేశారు.



## నీట్ పేపర్ లీకేజ్ నిరసిస్తూ జులై 4న దేశ వ్యాప్త విద్యాసంస్థల బందును జయప్రదం చేయండి..

పిలుపునిచ్చిన ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్యు, ఏఐఎస్ఏ, ఎన్ ఎస్ యు ఐ,-పిడిఎస్ఓ, పిఎస్యు సంఘాలు..



ఎమ్మిగనూరు జూలై 26 విభారె న్యూస్..నీట్, యూజీసీనెట్ పరీక్ష పేపర్ లీక్ ను నిరసిస్తూ 2024 జులై 4వ తేదీన దేశవ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ చేయాలని ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్నటువంటి కెవిపిఎస్ కార్యాలయంలో విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర నాయుడు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మహేంద్ర పిడిఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర టి ఎస్ యు జిల్లా కార్యదర్శి సురేష్ ఏఐఎస్ఏ పట్టణ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూవన్ నేషన్ - వన్ ఎక్సమ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్ప కూలింది. విద్యార్థుల విద్యా భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ)జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైంది. తీవ్రమైన అవకతకు, వ్యత్యాశాలతో జరిగిన నెట్ పీజీ పరీక్షకు బాధ్యత వహించి వాయిదా వేసింది. జూన్ 4న ప్రకటించిన నీట్ పరీక్షా ఫలితాలు పారదర్శకంగా లేవని పేపర్ లీక్ పై ఫిర్యాదులు వెల్లువెత్తారు.దీంతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారు. ఇటువంటి కేంద్రీకృత పరీక్షలు విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించి, ప్రోత్సహిస్తున్నది ఇది అత్యంత ప్రమాదకరం.ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా ఉంది. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య విపరీతంగా తగ్గడం జరిగింది. నీట్ యూజీసీ నెట్ పేపర్ లీకేజ్ లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అదేవిధంగా ఎన్ టి ఏ సంస్థను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యం పై దాడికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు బంద్ కు పిలుపునిచ్చాయి. కాబట్టి విద్యాసంస్థల యాజమాన్యాలు మేధావులు ప్రజాసంఘాల నాయకులు విద్యార్థులు బంద్ లో పాల్గొని, తరగతులను బహిష్కరించి ర్యాలీలలో నిరసన కార్యక్రమాలలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాము ప్రమోద్ పిడిఎస్యు పట్టణ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త నేర చట్టాలను వాయిదా వేయాలి

---సీపీఐ జిల్లా నాయకులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02-కేంద్రము లోని బిజెపి ప్రభుత్వము ఏకపక్షంగా దేశ వ్యాప్తంగా కొత్త నేర చట్టాలను అమలు చేయాలని నిర్ణయాన్ని వాయిదా వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం లో మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. ఏఐటీయూసీ. జిల్లా ప్రధాన కార్యదర్శి.పి. సుంకయ్య. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.కే. రాధాకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.



రంగనాయుడు మాట్లాడుతూదేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక కొత్త కొత్త చట్టాలను ప్రతిపక్షం లేదని ఏకపక్షంగా ప్రజా వ్యతిరేక చట్టాలను తేవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పార్లమెంటులో కొత్త చట్టం వ్యతిరేకంగా 140 పార్లమెంట్ సభ్యులను బలవంతంగా మార్చల్ చేత బయటికి పంపించి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) స్థానంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారత నాగరిక్ సురక్ష సంహిత చట్టాన్ని. దేశంలో జులై 1వ తేది న కొత్త నేర చట్టాలు అమలు అయ్యిందో లేదో అప్పుడే ఢిల్లీలోని ఒక వీధి వ్యాపారి రోడ్డుపై వాటర్ బాటిల్ సిగరెట్టు అమ్మడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించడంతో అమాయక వీధి వ్యాపారిపై కేసు నమోదు కావడం జరిగిందని నూతన మూడు చట్టాల వల్ల ప్రజలు పోలీస్ కష్టాలను తొలగించే అధికారం పోలీసులకు ఉందని ఇది న్యాయ శాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని చట్టంలో ఇంకా పూర్తిగా అమలు చేయని ఇతర నిబంధనలు అనేకం ఉన్నాయని ఇది బిజెపి పార్టీ అధికార దుర్వినియోగం దురహంకారమని కొత్త చట్టాలను సమీక్షించేంతవరకు అమలు చేయకుండా ఆపాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

## డిప్యూటీ సిఎం సీరియస్ వార్నింగ్‌తో కేసు పరిష్కారం

మిస్సింగ్ కేసులను వెంటనే కనిపెట్టిన పోలీసులు

జమ్మూలో జంటను గుర్తించిన ప్రత్యేక బృందం

భీమవరం,జూలై2 : భీమవరానికి చెందిన శివకుమారి కుమార్తె 9 నెలల కిందట మిస్ అయింది. అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది కానీ.. పోలీసులు నిర్లక్ష్యం చేశారు. ఎవరికి గోడు వెళ్లబోసుకున్నా వినిపించుకున్న వారు లేరు. కానీ జనసేన అధినేత , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తమ బాధ వెల్లడించిన వారంలోనే వారికి ఉపశమనం లభించింది. వారి కుమార్తె ఆచూకీ తెలిసింది. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో భీమవరానికి చెందిన శివకుమారి పాల్గొన్నారు. విజయవాడలో చదువుకుంటున్న తన కుమార్తె మైనర్ అనీ... ఆమెను ప్రేమ పేరిట ట్రాప్ చేసి కిడ్నాప్ చేశారని, గత తొమ్మిది నెలలుగా ఆమె జాడ తెలియడం లేదని పవన్ కల్యాణ్ ముందు కన్నీటితో మొరపెట్టుకుంది. మాచవరం పోలీస్ స్టేషన్లో దీనిపై ఫిర్యాదు చేశామని, తమ కూతురు జాడ తెలిసినా పోలీసులు స్పందించడం లేదని వేదన చెందారు.కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని పరిశీలించిన వెంటనే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాచవరం సీఐకు ఫోన్ చేసి కేసు వివరాలు తెలుసుకున్నారు. దీనిపై చర్యలకు ఆదేశించారు. పార్టీ నాయకులను, బాధితులను పార్టీ ఆఫీస్ వాహనంలోనే మాచవరం పోలీస్ స్టేషన్ కు పంపించారు. స్వయంగా డిప్యూటీ సీఎం ఆదేశించడంతో పోలీసులు కేసును సీరియస్ గా తీసుకున్నారు. యువతి విజయవాడ రామవరప్పాడుకు చెందిన యువకుడుతో జమ్మూలో ఉన్నట్లు గుర్తించి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. జమ్మూ నుంచి ఇద్దరినీ విజయవాడకు స్పెషల్ టీం తీసుకు వసస్తోంది. పవన్ కల్యాణ్ గతంలో ఏపీలో యువతుల మిస్సింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. జాతీయ గణాంకాలు కూడా అదే చెప్పాయి. ఇప్పుడు స్వయంగా ఆయన ఓ మిస్సింగ్ కేసుపై దృష్టి పెట్టి ..పోలీసుల్ని పరుగులు పెట్టించడంతో ఇతరు మిస్సింగ్ కేసులపై అధికారులు దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. జమ్మూ నుంచి యువతిని తీసుకు వచ్చిన తర్వాత పోలీసులు పూర్తి వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

## దేశంలోనే రాజధాని లేని రాష్ట్రం

--- పార్లమెంటులో నంద్యాల ఎంపీ శ్రీమతి బైరెడ్డి శబరి ఆవేదన




- - -విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02- దేశంలోనే రాజధాని లేని రాష్ట్రం ఎదంటే అది ఆంధ్రప్రదేశ్ నేనని టిడిపి ఎంపీ భైరెడ్డి శబరి పేర్కొన్నారు. మంగళవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ గత 5 ఏళ్ళుగా రాష్ట్రం నాశనమైందని ప్రస్తుతం ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా ఉందన్నారు . అమరాతి రాజధానిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం 3 రాజధానుల పేరుతో కాలయాపన చేసిందన్నారు . పోలవరాన్ని నాశనం చేసిందన్నారు . రాయలసీమకు ఒక్క పరిశ్రమని తీసుకురాలేక పోయిందన్నారు . కక్ష సాధింపు రాజకీయాలు, అవినీతి తప్ప, గత 5 ఏళ్ళు రాష్ట్రంలో ఏమి జరగలేదు. అన్ని విధాలుగా నష్టపోయిన రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకోవాలని టీడీపీ నంద్యాల ఎంపీ శ్రీమతి బైరెడ్డి శబరి కోరారు .

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి....




విబారే న్యూస్ డోన్ మా ప్రతిది:-జూలై 2 కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నీట్ నెట్ పేర్లతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యారంగాన్ని కాపాడాలని ఈనెల జులై 4న జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బందులో అధిక సంఖ్యలో విద్యార్థులు కలిసి వచ్చి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్ నాయక్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జె.అశోక్ పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్ నాయక్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జే.అశోక్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూబీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యారంగాన్ని విచ్చిన్నం చేస్తున్నదని అందులో భాగంగానే కేంద్రం రాష్ట్రం యొక్క విద్యా హక్కులను కాలరాస్తూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్ టి ఏ లాంటి సంస్థలను రద్దు చేయాలి. నీట్ పరీక్షను రాసి నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని నీట్ పరీక్ష రద్దుపై నైతికంగా కేంద్ర కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులపై కేసులు సరైనది కాదని పాఠశాలలు మూసివేతలను ఆపాలని పీహెడీ అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న పరీక్షల్లో నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అలాగే తిరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫెలోషిప్ల పెంచాలని,విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అన్నారు నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలిలీకులకు కారణమైన ఎన్టిఏ సంస్థను రద్దు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేంద్ర,శివకాంత్, గిడ్డయ్య, సోమనాథ్ రెడ్డి,విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విపక్షహోదా సీట్లను బట్టే వస్తుంది

ఓట్ల శాతాన్ని బట్టి విపక్ష నేతగా గుర్తించరు

అభివృద్దిని పక్కన పెట్టడం వల్లే జగన్ ఓటమి

సిపిఐ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు

విశాఖపట్టణం,జూలై2: అసెంబ్లీలో సభ్యుల సంఖ్యను బట్టి ప్రతిపక్ష హోదా ఉంటుందని.. అంతే తప్ప ఓట్లశాతం బట్టి ఉండదని సిపిఐ నేత నారాయణ స్పష్టం చేశారు. కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే ఇస్తే సరిపోదని.. అభివృద్ధి కూడా కావాలని నారాయణ అన్నారు. కేవలం డబ్బులు పందేరంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోవడం వల్లనే వైసీపీకి 11 స్థానాలు వచ్చాయన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్‌పై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో స్పష్టమైన వైఖరి అవసరమని.. ఈ విషయాన్ని జగన్ తెలుసుకోలేక పోయారన్నారు. జగన్ న్యూట్రల్ స్టాండ్ తీసుకోవడం వల్లే వైసీపీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. బీజేపీతో ఉంటే ఉన్నామని.. లేకపోతే లేమని జగన్ గట్టిగా చెప్పలేక పోయారన్నారు. న్యూట్రల్ స్టాండ్ వలన జగనే కాదని.. కేసీఆర్, నవీన్ పట్నాయక్ కూడా తీవ్రంగా నష్టపోయారన్నారు. బీజేపీతో కలిసి వెళ్లాలని.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారని.. అది వాళ్ల వరకూ కరెక్టేనని నారాయణ అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించామన్నారు. జగన్ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. రుషికొండ భవనాలు నిర్మించేటప్పుడు ప్రతిపక్ష నేతలను అక్కడకు జగన్ సర్కార్ వెళ్లనీయలేదన్నారు. ఈ భవనాల్ని కూటమి ప్రభుత్వం ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించాలని నారాయణ తెలిపారు. కూటమిలో పవన్ కల్యాణ్ డైనమిక్ పాత్ర పోషించారన్నారు. పవన్‌కి మంచి సినిమా పాపులారిటీ ఉందని.. అది ఎన్నికల్లో ప్లస్ అయిందన్నారు. అందుకే పోటీ చేసిన అన్నిచోట్ల జనసేన గెలిచిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వబోనని పవన్ ముందే చెప్పారని పవన్ అన్నారు. అదే నిజం చేశారిన అన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190